క్లుప్తంగా

ఉత్తమ సేవలు అందించాలి


మాంద్రు రాజేంద్రకు బొకే ఇస్తున్న సంతోష్ కుమార్ తదితరులు

ఏలూరు (టూటౌన్) : రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడే విధంగా ఉత్తమ సేవలు అందించాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ కోరారు. ఇటీవల సీఐడీ ప్రత్యేక పీపీగా నియమితులైన మాంద్రు రాజేంద్రను స్థానిక శ్రీరామ్ నగర్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్ ఫలాల కారణంగానే నేడు ఇటువంటి పదవులను ఎస్సీలు పొందగలుగుతున్నారని సంతోష్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా సీఐడీ డీజీపీ పి.సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పల్లా యేసేబు, వెంపా నాగరాజు, కుమ్మరి భూషణం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆకాశ జ్యోతి దర్శనం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక దొండపాడు బాల అయ్యప్ప క్షేత్రంలో ఈ నెల 14న విశేష పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు అయ్యప్ప స్వామికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకం, 11 గంటలకు 108 రకాల స్వీట్లు, పండ్లు, ఫలహారాలతో మహానివేదన ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 6.30 గంటలకు శబరిమలైలో జ్యోతిదర్శన సమయంలో బాల అయ్యప్ప క్షేత్రంలో ప్రతిష్ఠితమైన పావన పదునెట్టాంబడికి అఖండ కర్పూర జ్యోతి నీరాజనం, బాల అయ్యప్ప స్వామి దివ్యదర్శనం, అనంతరం ఆకాశ జ్యోతి దర్శన కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. రాత్రి 7.30 గంటలకు నగరానికి చెందిన నాట్యాచార్యుడు డి.హేమసుందర్ శిష్యులచే కూచిపూడి, జానపద నృత్యాల ప్రదర్శన ఏర్పాటు చేశామని తెలిపారు.జ

157 బైండోవర్ కేసుల నమోదు


పోణంగిలో టెంట్ పీకేయించిన తహసీల్దార్

ఏలూరు రూరల్: సంక్రాంతిని పురస్కరించుకుని కోడి పందేలు, జూదం నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.సోమశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం పోణంగిలో కోడి పందేల నిర్వహణకు ఏర్పాటుచేసిన టెంట్లను ఆయన సిబ్బందితో తొలగింపజేశారు. స్థానిక సచివాలయం వద్ద ప్రజలతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో కోడిపందేల ఏర్పాటును అడ్డుకుంటున్నామని చెప్పారు. ఇప్పటి వరకు 157 బైండోవర్ కేసులు నమోదు చేశామని, 21 మందికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. కోర్టు ఆదేశాల దిక్కరించే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఎన్జీ సుందరమ్మ మెమోరియల్ స్కూల్‌లో పూర్వ విద్యార్థులు

ఏలూరు రూరల్ : ఏలూరు శ్రీమతి ఎన్జీ సుందరమ్మ మెమోరియల్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం రాత్రి స్థానిక రాయల్‌స్టార్ కమ్యూనిటీహాల్లో ఘనంగా నిర్వహించారు. 1983 నుంచి 1989 మధ్య చదువుకున్న విద్యార్థులు హాజరయ్యారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, పురుషోత్తంలకు శాలువ కప్పి సత్కరించి మెమెంటో అందజేశారు. నగర కార్పొరేషన్ కో–ఆప్షన్ సభ్యుడు మున్నల జాన్ గురునాథ్, బి.అశోక్‌కుమార్ (కాసులు), డాక్టర్ ఫకార్ అహ్మద్, సయ్యద్ జిలానీ, మహ్మద్ జిలానీ, రోషన్ జమీర్, షేక్ నజీర్, మహ్మద్ అక్రమ్, రేవులగడ్డ ఏసుపాదం, మానేపల్లి విజయ్‌కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం

ఏలూరు టౌన్: ఏలూరు ఎన్ఆర్‌పేట కేవీ హాస్పిటల్ వీధిలో రైల్వే ట్రాక్ రోడ్డులో డ్రెయినేజీలో ఒక గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసును త్రీటౌన్ సీఐ వరప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. మహిళ ధరించిన వాచ్, చెవి రింగులు, చెప్పులు, చేతికి కడియాన్ని గుర్తించారు. వివరాలు తెలిస్తే త్రీటౌన్ స్టేషన్ రైటర్ ఫోన్ నెంబర్ 94498 63121 లేదా త్రీటౌన్ సీఐ ఫోన్ 94409 04808కు తెలియజేయాలని కోరారు.

సంతోషాల హరివిల్లు సంక్రాంతి

- ఉత్సాహంగా సంబరాలు
- ఆకట్టుకున్న సంప్రదాయ వేషధారణలు



సంక్రాంతి పాటకు నృత్యం చేస్తున్న చిన్నారి, రైతు వేషాధారణలో బుడతడు


ఏలూరు కార్పొరేషన్ కార్యాలయంలో భోగిమంట వెలిగిస్తున్న కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ తదితరులు

ఏలూరు టౌన్ : ఏలూరు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. తెలుగుజాతి అత్యంత ఉత్సాహంగా నిర్వహించే సంక్రాంతి పండుగను మహిళలు ముందస్తుగా ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. భోగిమంటలు వెలిగించారు. గంగిరెద్దుల విన్యాసాలు, స్వయం సహాయక సంఘాల మహిళలు పోటీపడి రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంక్రాంతి పిండివంటల స్టాల్స్‌ను మహిళలు ఏర్పాటు చేశారు. చిన్నారుల జానపద, భరత నాట్య ప్రదర్శనల అలరింపజేశాయి. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథులుగా ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు సంక్రాంతి సంబరాలను ఆసక్తి తిలకించారు. ఆనందం వ్యక్తం చేశారు. మన సంస్కృతి సంప్రదాయాలను ప్రజలకు తెలియజేస్తూ, పిల్లలు వాటిని ఆచరించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీఎల్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు గుడిదేశి లక్ష్మీశారద, మెప్మా పీడీ ఇమ్మానుయేల్, అసిస్టెంట్ కమిషనర్ చోడే బాపిరాజు, పీఓ కృష్ణమూర్తి, కార్పొరేషన్ ఆర్ఓలు, మెప్మా సిబ్బంది, సీఓలు, ఆర్పీలు, ఎస్ఎస్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా ఖజానా కార్యాలయంలో..

ఏలూరు(మెట్రో): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఖజానా శాఖ కార్యాలయం ఏలూరులో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఖజానా శాఖ ఉద్యోగులు అందురూ సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్నారు. బొమ్మల కొలువు, రంగవల్లులు గొబ్బెమ్మలతో ఖజానా కార్యాలయ ప్రాంగణం సంక్రాంతి శోభను సంతరించుకుంది. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి గౌరవ ఉప సంచాలకులు కృష్ణ, అసిస్టెంట్ ట్రెజరీ అధికారి ప్రేమావతి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ కప్పల సత్యనారాయణ, ట్రెజరర్ నెరుసు గణేశ్వరరావు, జిల్లా ఖజానా కార్యాలయం అడ్మిన్ ఎస్‌టీఓ టి.భారతి తదితరులు పాల్గొన్నారు.


జిల్లా ఖజానా కార్యాలయంలో విజేతలకు బహుమతి అందిస్తున్న దృశ్యం

నగరానికి సంక్రాంతి శోభ

- బంధువుల రాకతో సందడి
- ప్రయాణికులతో కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తెలుగు ప్రజల అతి పెద్ద పండుగ సంక్రాంతిని పురస్కరించుకుని ఏలూరు నగరం నూతన శోభను సంతరించుకుంది. ఇప్పటికే విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ప్రకటించడంతో నగరానికి వచ్చే బంధువులు, నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే నగర ప్రజలతో రహదారులన్నీ రద్దీగా మారాయి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాల్లో స్థిరపడిన జిల్లా ప్రజలు వివిధమార్గాల ద్వారా జిల్లాకు చేరుకుంటున్నారు.


ఆర్‌ఆర్‌పేట ఓ షాపింగ్‌మాల్ వద్ద రద్దీ


ఏలూరు వన్‌టౌన్‌లో పండుగ సందడి

జనసంద్రంగా మార్కెట్

సంక్రాంతి పండుగకు వచ్చే కూతుళ్లు, అల్లుళ్లు, మనవలకు నూతన వస్త్రాలు అందజేయడం ఇక్కడ అనాదిగా సంప్రదాయంగా వస్తోంది. ఈ నేపథ్యంలో నగరంలోని వస్త్ర దుకాణాలు జన సంద్రంగా మారాయి. ఏ దుకాణంలో చూసినా ప్రజలతో కిటకిటలాడుతున్నాయి. కొన్ని వస్త్ర దుకాణాలు అనేక ఆఫర్లు ప్రకటించాయి. పండుగ సందర్భంగా చేసే పూజలకు పండ్లు, పూలు విక్రయాలు ఇబ్బడిముబ్బడిగా జరిగాయి. పిండి వంటలకు వినియోగించే పచారీ వస్తువుల కోసం వచ్చిన ప్రజలతో కిరాణా దుకాణాలు సైతం కిటకిటలాడాయి.

భోగి మంటలకు ఏర్పాట్లు

సంక్రాంతి పండుగ ముందు రోజు వచ్చే భోగి పండుగకూ ప్రత్యేకత ఉంది. నగరంలోని దాదాపు ప్రతి వీధిలో భోగి మంటలు వేయడానికి స్థానికులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే భారీ స్థాయిలో కలపను భోగి మంటల కోసం సిద్ధం చేశారు. ప్రతి ఇంటి ముంగిటా భోగి, సంక్రాంతి ప్రస్ఫుటించేలా రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు.

రైల్వే స్టేషన్లు, బస్టాండుల్లో రద్దీ

పండుగకు నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలతో బస్టాండులు, రైల్వేస్టేషన్లు రద్దీగా మారాయి. బస్సు ప్రయాణికులతో కిటకిటలాడుతూ కనిపించాయి. ఇక రైళ్లలో ప్రయాణాలు అసాధ్యంగా మారాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లు ఏలూరు వచ్చేటప్పటికే నుంచునేంత ఖాళీ కూడా లేకుండా దర్శనమిచ్చాయి. ముందస్తుగా రిజర్వేషన్లు చేసుకున్నా రిజర్వేషన్ భోగీల్లోకి ఎక్కడానికి కూడా ప్రయాణికులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. కరోనా ప్రభావంతో జిల్లాకు చెందిన అనేక మంది గత రెండేళ్లుగా జిల్లాకు రావడానికి వీలు పడకపోవడంతో ఈ ఏడాది ఎలాగైనా సొంతప్రాంతానికి రావాలనే ఊపుతో ప్రైవేట్ వాహనాల్లో కూడా వస్తున్నారు.


సొంతూరు చేరుకున్న ప్రయాణికులు


ఏలూరు పాతబస్టాండ్ సెంటరులో గ్రామాలకు వెళ్లేందుకు వేచి ఉన్న ప్రయాణికులు

విజయవంతంగా సంక్రాంతి క్రీడోత్సవాలు


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న డీఎస్పీ పైడేశ్వరరావు, సీఐ ఆదిప్రసాద్


ముగ్గులు పోటీల్లో పాల్గొన్న యువతులు

ఏలూరు టౌన్: సంక్రాంతి వేడుకలను ప్రజలంతా సంతోషంగా నిర్వహించుకోవాలని, యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సంప్రదాయాలకు విలువ ఇవ్వాలని ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ఆదేశాలతో ఏలూరు సబ్‌డివిజన్ పరిధిలో ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి క్రీడోత్సవాలు నిర్వహించారు. క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన జట్టులకు బహుమతులు ప్రదానం చేశారు. డీఎస్పీ పైడేశ్వరరావు, తహసీల్దార్ సోమశేఖర్, వన్‌టౌన్ సీఐ బోనం ఆదిప్రసాద్, ఎస్సైలు లక్ష్మీబాబు, రామకృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో 15వ డివిజన్ జట్టు విజేతగా నిలవగా, 16వ డివిజన్ జట్టు రన్నర్స్‌గా నిలిచారు.

తెలుగు ప్రజల ప్రియమైన పండుగ సంక్రాంతి

ఏలూరు (టూటౌన్): తెలుగు ప్రజల ప్రియమైన పండుగ సంక్రాంతి అని సీఐటీయూ నాయకులు పి.కిషోర్ అన్నారు. తిప్పాని లక్ష్మీకాంతం స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో డీవైఎఫ్ఐ సంక్రాంతి ఆటల పోటీల్లో భాగంగా స్థానిక తూర్పువీధి, కుస్తీలు దొడ్డి ప్రాంతంలో ముగ్గులు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కిషోర్ మాట్లాడుతూ ఏలూరులో గత 30 ఏళ్ల నుంచి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు, యువతను తప్పు దోవ పట్టిస్తున్న గంజాయి వంటి మత్తు పదార్థాలను అరికట్టాలని అన్నారు. వ్యవసాయ పంటలు చేతికి అందిన నేపథ్యంలో పుట్టుకొచ్చిన పండుగ సంక్రాంతి అని వివరించారు. ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి మాట్లాడుతూ మహిళలపై అకృత్యాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, బాల సంఘం నిర్వాహకులు సీహెచ్ ఆంతోని, స్థానిక పెద్దలు ఇ.శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ సేవలు అభినందనీయం


శిక్షణ తరగతుల అభ్యర్థులతో ఏలూరు డీఎస్పీ పైడేశ్వరరావు

ఏలూరు టౌన్: యువత ఉపాధి, ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు సూచించారు. ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్‌లోని ఎస్‌వీఆర్‌కే డిగ్రీ కాలేజీలో ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోలీస్ ఉద్యోగాల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. డీఎస్పీ పైడేశ్వరరావు అభ్యర్థులకు పరీక్షల విధానం, విజయం సాధించటంపై అవగాహన కల్పించారు. పలు సూచనలు చేశారు. ఉద్యోగాల సాధనలో తమ వంతు తోడ్పాటునందిస్తూ ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ ఉచిత శిక్షణ ఇవ్వటం అభినందనీయమని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ ఎం.హుస్సేన్, ఎస్‌వీఆర్కే డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ నాగబాబు, ఫ్యాకల్టీ పి.వరప్రసాద్, డి.విజయ్, కార్తీక్, టాగూర్, సలీం, మాణిక్యం ఉన్నారు.

పవన్ అనుచిత వ్యాఖ్యలకు ఖండన

ఏలూరు (టూటౌన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మంత్రులపై జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వైఎస్సార్సీపీ లీగల్ సెల్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు లీగల్ సెల్ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ డీవీ రామాంజనేయులు శుక్రవారం పేర్కొన్నారు. ఎన్నికల బరిలో ఒంటరిగా పోటీచేసి గెలిచే ధైర్యం లేని పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి జగన్, మంత్రులను విమర్శించే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రను ఆర్థిక రాజధాని చేస్తాం కాని విశాఖను ఆర్థిక రాజధాని కానివ్వం అనే రీతిలో పవన్ వ్యాఖ్యలు ఉన్నాయని విమర్శించారు. రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతో ప్రతిపక్షనేత చంద్రబాబుతో కలిసి పవన్ ఉద్దేశ పూర్వకంగానే యువతను రెచ్చగొట్టే చట్ట వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

శ్రీవారికి చందన అలంకరణ



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావు పేట వేంటకేశ్వర స్వామి దేవస్థానంలో త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి చందన అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. తెనాలికి చెందిన నోరి నారాయణ మూర్తి శ్రీమద్రామాయణం – బాలకాండ అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. నగరానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. రాత్రి 7.30 గంటలకు తాడేపల్లిగూడెంకు చెందిన ముదపాక బాల సుందరం భాగవతార్ శ్రీమద్విరాటపర్వం అనే అంశంపై చేసిన హరికథా కాలక్షేపం కట్టుకుంది.

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు గ్రాండ్ టెస్ట్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు ఉచిత మెగా గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు నగరానికి చెందిన త్రివేణి ప్రసాద్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18న నగరంలోని తమ స్టడీ సర్కిల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ పరీక్షను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నెంబర్ 93476 57730లో సంప్రదించాలన్నారు.

ఫ్యాప్టో నిరసన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాట్లు నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. డీఈఓ డి.మధుసూదన రావుకు వినతిపత్రం అందజేశారు. పీబీవీఎస్ఎల్ నారాయణ, జి.వెంకటేశ్వరరావు, బి.మనోజ్ కుమా ర్, కె.నరహరి, ఎండీ జిలాని, పీవీ నరసింహరావు, జి.కృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు


ప్రథమ స్థానంలో నిలిచిన తాడినాడ జట్టు

ఏలూరు రూరల్: సంక్రాంతి సందర్భంగా ఏలూరు మండలం చాటపర్రులో చేపట్టిన వాలీబాల్ పోటీలు ముగిశాయి. శుక్రవారం హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణాజిల్లా తాడినాడ జట్టు గుడివాకలంక జట్టుపై విజయం సాధించింది. రెండో స్థానంలో గుడివాకలంక జట్టు, మూడో స్థానంలో గుజువలపట్నం జట్టు, నాలుగో స్థానంలో కైకలూరు జట్టు నిలిచాయి. విజేతలకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చేతుల మీదగా బహుమతులు అందజేశారు. సర్పంచ్ గుడిపూడి రఘు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తేరా ఆనంద్, ముంగర సంజీవ్‌కుమార్, పల్లెం ప్రసాద్, రుక్మనంద మహరాజ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లకు స్థానచలనాలు


డీఎంహెచ్ఓ నాగేశ్వరరావును సత్కరిస్తున్న కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు

ఏలూరు టౌన్: అనేక ఏళ్లుగా ఒకే చోట ఉద్యోగం చేస్తూ బదిలీ అవకాశాలు లేక అవస్థలు పడుతోన్న వైద్య ఆరోగ్యశాఖలోని కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లకు ఎట్టకేలకు స్థాన చలనాలు లభించాయి. ఆ వివరాలను ఏపీ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ వెల్లడించారు. వైద్య ఆరోగ్య శాఖలో కొత్తగా వచ్చిన వైఎస్సార్ హెల్త్ క్లీనిక్స్‌కు కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను సర్దుబాటు చేస్తూ ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులతో సమస్యకు పరిష్కారం లభించిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగేశ్వరరావును సత్కరించారు. ఆయన చొరవతో కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 20 ఏళ్లుగా బదిలీలకు నోచుకోని ఉద్యోగులకు మేలు జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులతో 410 మంది ప్లెయిన్ ఏరియా వారికి, 25 మంది ఏజెన్సీ ప్రాంతాల వారికీ స్థాన చలనం జరిగే అవకాశం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లా అప్పారావు, తదితరులు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రతతో వ్యాధులు దూరం


ఏలూరులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

ఏలూరు టౌన్: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దరిచేరవని ఏలూరు జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక టైటస్ నగర్‌లో ఏలూరు అర్బన్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫ్రై డే.. డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలు జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జ్వరం వస్తే వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని సూచించారు. దోమల నిర్మూలనకు ఇంటి పరిసరాల్లో నీటితొట్టెలు, డ్రమ్ములు, ఫ్లవర్ వాజులు, పూల కుండీలు, ఫ్రిడ్జి వెనుక బాక్సుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దత్త చరణ్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, రమేష్, ఏఎన్ఎంలు, ఆశలు ఉన్నారు.